క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నారాయణ స్వామి గ్రామోత్సవం



సామర్లకోటలో మాండవ్య నారాయణ స్వామి గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలో అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, శ్రీదేవి, భూమి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహిచారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా గ్రామోత్సవం ప్రారంభమైంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారి వీధి, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, నీలమ్మ చెరువు, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం కొనసాగింది.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



స్వామివారికి పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పిఠాపురంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్, ఎం.చిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా హయగ్రీవ జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో హయగ్రీవ స్వామివారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన హయగ్రీవ స్వామివారి జయంతి ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు విశేష అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీకా శిబిరాలను వినియోగించుకోండి

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు నిర్వహించే పశువులకు గాలికుంటు టీకా శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ పెద్దాపురం అసిస్టెంట్ డైరెక్టర్ తుమ్మల రామస్వామి కోరారు. సోమవారం ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. పెద్దాపురం మండలంలో 23,950 టీకాల డోసులు, కిర్లంపూడి మండలంలో 14,500 టీకాలు డోసులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి పాడి రైతు తమ పశువులకు గాలికుంటు టీకాను తప్పనిసరిగా వేయించాలని ఏడీ రామస్వామి కోరారు.

ఓటర్ల సర్వే సక్రమంగా జరగాలి



సామర్లకోటలో బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఓటర్ల సర్వే సక్రమంగా జరగాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి, అక్కడున్న ఓటర్లను గుర్తించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చాలన్నారు. ఒక వార్డు నుంచి మరో వార్డుకు బదిలీ అయిన వారిని గుర్తించి, వారు నివాసం ఉండే వార్డులోనే ఓటు లభించేలా చూడాలన్నారు. అదే విధంగా చనిపోయిన వారుంటే, ఆ కుటుంబ సభ్యుల ద్వారా మృతుల పేరును ఓటరు లిస్టు నుంచి తొలగించేలా డిక్లరేషన్ తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోతే పంచనామా నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు బీఎల్‌ఓ నుంచి సమాచారం సేకరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



పిఠాపురం మహా సంస్థానంలో రాఖీలు కడుతున్న మహారాష్ట్ర భక్తులు



స్వామివారికి దత్త హోమం నిర్వహిస్తున్న భక్తులు



రాఖీ కడుతున్న విభిన్న ప్రతిభావంతుల చిన్నారులు

నీవే రక్ష.. కాపాడు స్వామీ !

- ఘనంగా రాఖీ పౌర్ణమి ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- దత్తాత్రేయ స్వామి దర్శనానికి క్యూ కట్టిన మహారాష్ట్ర భక్తులు
- స్వామివారికి రాఖీలు కట్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో మహారాష్ట్ర భక్తులు

పిఠాపురం: రక్షాబంధన్ వేడుకలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో ఆలయలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఇక్కడ రాఖీలకు గిరాకీ పెరగింది. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలం కావడంతో పిఠాపురంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. వేలాది మంది భక్తుల తరలిరావడంతో దత్తాత్రేయుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఏటా సందడి

ఏటా రాఖీ పౌర్ణమి రోజున దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి రాఖీలు కట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది సుమారు 20 వేల మంది వరకు మహారాష్ట్ర భక్తులు తరలిరావడంతో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. పిఠాపురంలో పేరొందిన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్తులు, అర్చకులు స్వామివారికి రాఖీలు కట్టారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయలంలో వేంచేసిన దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొల్లప్రోలు మండలంలో...

రాఖీ పౌర్ణమి సందర్భంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో స్వామి, అమ్మవార్లకు రుద్ర సహిత, శ్రీసూక్తసంపుటీకరణతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి లలితా సహస్ర నామ కుంకుమార్చనలు చేశారు. వందలాది మంది భక్తులు బారులు తీరి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాల వద్ద బారీ అన్నదానాలు నిర్వహించారు.



స్వామివారి రాఖీని భక్తులకు చూపుతున్న ఆలయ అర్చకుడు



సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

ఘనంగా వేడుకలు

పెద్దాపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తెలియజేసే రక్షా బంధన్ (రాఖీ) పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. సోదర ప్రేమను తెలియజేస్తూ కుటుంబ సభ్యులతో చిన్నారులు ఆనందంగా గడిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న అన్నల కోసం ఆత్రంగా ఎదురుచూసిన చెల్లెళ్లు, చెల్లెళ్లతో రాఖీ కట్టించుకున్న అన్నలతో కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా, సంప్రదాయాన్ని గౌరవిస్తూ రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు సోదర భావం తెలియజేస్తూ పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య విద్యార్థులతో రాఖీ కట్టించారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్నలకు చెల్లెలు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అన్నదమ్ములకు అక్కాచెల్లెలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీలు కట్టిన చెల్లెళ్లకు అన్నలు బహుమతులు, ఆశీర్వచనాలు అందజేశారు.

ఆనందోత్సాహాలతో..

సామర్లకోట: రక్షా బంధన్ మహోత్సవం సోమవారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టే కార్యక్రమం ప్రారంభించారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రాఖీలు కట్టాక. మిఠాయిలు తినిపించుకుని ఆనందంగా గడిపారు. స్థానిక ఓం శాంతి బ్రహ్మకుమారిల ఆనంద భవనానికి చెందిన నిర్వాహకులు అచ్చంపేటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, మున్సిపల్ కమిషనర్ జె రామారావు, తహసీల్దార్ కె చంద్రశేఖరరెడ్డి, భరతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర తదితరులకు వారు రాఖీలు కట్టారు. బ్రహ్మకుమారి సమాజానికి చెందిన లక్ష్మీ రక్షా బంధన్ ఆధ్యాత్మిక రహస్యాన్ని తెలియజేశారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ఆర్డీఓ సీతారామారావు
- గ్రీవెన్స్‌కు 20 అర్జీలు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 20 అర్జీలు అందినట్టు వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు మూడు అంశాలపై 20 విజ్ఞాపనలు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, డీటీ భానుకుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సీపీఎం పట్టణ నాయకులు కోరారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్ తదితరులు సోమవారం ఆర్డీఓ జేఎస్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇటీవల తీవ్ర జ్వరాలతో మండలంలోని చదలాడ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందారన్నారు. పట్టణంలో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు వైద్య సేవలందించాలని కోరారు. నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేయాలి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

సామర్లకోట: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో నేర్చుకున్న అంశాలను పూర్తిగా అర్థం చేసుకుని, ఆయా పాఠశాలల్లో అమలు చేయాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం మాధవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాధవపట్నం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాలు టైం టేబుల్ ప్రకారం జరగాలన్నా రు. అన్ని సెషన్స్‌లోను విద్యా విషయాలపై కూలంకషంగా చర్చ జరగాలని సూచించారు. పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు 100 శాతం భోజనం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు భోజనం రుచిగా ఉంటే, ప్రతి ఒక్కరూ భోజనం చేస్తారని చెప్పారు. దీనిలో భాగంగా విద్యాశాఖాధికారులు తరచూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నదని చెప్పారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఎలా అమలు చేస్తారు?

మాల మహానాడు నేతల ప్రశ్న



సామర్లకోటలో సమావేశంలో మాట్లాడుతున్న నేతల హరిబాబు

సామర్లకోట: ఎస్సీ వర్గీకరణ చేయడానికి వీల్లేదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వగా, ఇప్పుడు అదే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని తీర్పు ఇవ్వడం వింతగా ఉందని మాల మహానాడు నాయకులు వ్యాఖ్యానించారు. స్థానిక జగనన్న కాలనీలో సోమవారం మాల సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నేతల హరిబాబు అధ్యక్షత వహించారు. ఎస్సీ వర్గీకరణ ఏవిధంగా చేస్తారని ఆయన ప్రశ్నించారు. లోక్ సభలో పూర్తి మెజార్టీతో తీర్మానం చేసినప్పుడు బిల్లు అమలు జరుగుతుందన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడితో కోర్టులు పని చేస్తున్నాయనే విషయం స్పష్టమవుతుందనే అనుమానం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న భారత్ బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఐక్యతతో ఉన్న మాల, మాదిగలను విడదీసేందుకు కుయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆంధ్రమాల మహానాడు అధ్యక్షుడు లింగ శివకుమార్, మాల మహానాడు నాయకులు వారా సుధాకర్, మైలవరపు జానీ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం



దాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సామర్లకోట: ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్లు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ఉషా సూడియో వద్ద కెమేరా సృష్టికర్త లూయిస్ జాక్విస్ మాండ్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాగురె జన్మదినాన్ని ఏటా ఫొటోగ్రాపర్ల దినోత్సవంగా జరుపుతున్నట్టు సీనియర్ ఫొటోగ్రాఫర్ అడబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డాగురె సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు సారా శ్రీను, రాము సూరిబాబు, తాళ్లపూడి దివాకర్, నరసింహమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మధుర జ్ఞాపకంగా చూపించేది

కొత్తపల్లి: ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది ఫొటో మాత్రమేనని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి వెంటరమణ అన్నారు. మండంలోని వాకతిప్పలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కెమెరా సష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాగురే కృషి ఫలితంగా నేడు లక్షలాది మంది ఫొటోగ్రఫీ వృత్తిలో ఉపాధి పొందుతున్నారని కొనియాడారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

కాకినాడ రూరల్: సమాజానికి ఉపయోగపడే ఆలోచనలతో పాటు, విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. పండూరు జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు.

సైన్స్ ఆఫీసర్ వినీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావి సైంటిస్టులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత సైన్స్ ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా నేటి నుంచి కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో చేసేలా చూడాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్, కాకినాడ టౌన్, సామర్లకోట, పెదపూడి మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు 70 మంది హాజరయ్యారు. డీఈఓ వెంట పాఠశాల హెచ్ఎం ఈ.సూర్యప్రకాశిని ఉన్నారు.

స్వీకరణేనా..! పరిష్కారాలు లేవా ?

- మూడుసార్లు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోని అధికారులు
- మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నిరసన



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సూర్యనారాయణ

పిఠాపురం: నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించడం తప్ప పరిష్కరించడం కనిపించడం లేదని మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. ఇచ్చిన ఫిర్యాదుపై కనీస చర్యలు తీసుకోపోతే ఈ వేదిక నిర్వహించడం దేనికంటూ ప్రశ్నిస్తున్నారు. ఆయా సంఘాల నాయకులు సోమవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు మరోసారి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్. సూర్యనారాయణ మాట్లాడుతూ ఏదైన సమస్య అధికారులు పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్‌కు చెప్పుకుంటామని, అలాంటిది కలెక్టర్‌కు చెప్పినా సమస్య పరిష్కారం కాకపోతే ఇంక ఎవరికి చెప్పాలంటూ ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతున్న అరికట్టడం లేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే కలెక్టర్‌కు మూడుసార్లు వినతిపత్రం అందజేసినా ఇప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం వలన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సారా, బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. దీంతో ప్రజలు తాగుడికి బానిసలై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. పిఠాపురం మండలంలోని మల్లాం, జల్లూరు, విరవాడ, జగ్గయ్య చెరువు, మోహన్ నగర్, అన్నపూర్ణ థియేటర్ వెనుక, నర్సింగపురం, పి.రాయవరం, పి.తిమాపురం గ్రామాల్లో సారా, మద్యం సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, ప్రతి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డి ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ



నవరలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులను ఈ నెల 27 నుంచి జరగనున్న పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. మండలంలో నవర గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. వంద శాతం విద్యార్థులు భోజనం చేసేలా చూడాలని ఆదేశించారు.

ప్రయాణికులతో బస్సుల కిటకిట



సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సామర్లకోట: వరుస సెలవులతో స్వగ్రామాలకు వచ్చిన వారు స్వగ్రామాలకు వెళ్లడానికి సిద్ధం కావడంతో సోమవారం సాయంత్రం బస్సు కాంప్లెక్స్ కిటకిటలాడింది. రక్షాబంధన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న వారు గమ్యాలకు పయనమయ్యారు. దాంతో రైల్వే స్టేషన్‌తో పాటు, బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. ఇదే అదునుగా జేబుదొంగలు రెచ్చిపోవచ్చన్న అనుమానంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తమ సిబ్బందితో బస్సు కాంప్లెక్స్‌లో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏఎస్సై రత్నం బస్సు కాంప్లెక్స్‌లో బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు సూరాడపేట కమ్యునిటీ భవనంలో సోమవారం జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మత్స్యకారులు, విద్యార్థులకు ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ మన్మోహన్‌సింగ్ యాదవ్ భూకంపాలు, వరదలు, తుపానులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ వరకూ తీరప్రాంతాల్లోని 16 మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 6 మండలాల్లో నిర్వహించామన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి విపత్తులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వేట్లపాలెంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ చైర్మన్ శ్రీనివాసు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని విశ్వ మానవతా సంస్థ చైర్మన్ అల్లూరి శ్రీనివాసు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని వేట్లపాలెం శ్రీ రామకృష్ణ సేవా సమితిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి, వాటి సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలను గుర్తించి, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి క్రమశిక్షణను తల్లిదండ్రులు అలవర్చాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన మొక్కలు అందజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, త్రీ టౌన్, తిమ్మాపురం, టూటౌన్, ఇంద్రపాలెం, సర్పవరం, కరప, పోర్ట్ పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా, 9 మందికి రెండు రోజుల వంతున జైలు,, మరొకరికి వారం రోజుల జైలు, 43 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఒకరికి రెండు రోజుల జైలు, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరింగి, పెదపూడి, వన్ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిక్ష విధించారు.